క్లుప్తంగా

నరసింహారావుకు అభినందన



నరసింహారావు

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో పీఓ డీటీ విభాగంలో హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ అధికారిగా పనిచేస్తున్న బెల్లం నరసింహారావుకు ప్రకాశం జిల్లా విస్తృత, మాస్ మీడియా అధికారిగా ప్రభుత్వం పదోన్నతి కల్పించి ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శనివారం వైద్యశాఖ కార్యాలయంలో పలువురు అధికారులు, సిబ్బంది ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.

వివాదాస్పద రిజిస్ట్రేషన్‌పై రచ్చ

- కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన



కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు నిరసన చేస్తున్న తులసమ్మ, కుటుంబసభ్యులు

కోవూరు: కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మరోసారి వివాదాస్పద రిజిస్ట్రేషన్ వెలుగు చూసింది. విడవలూరుకు చెందిన ఏనేటి తులసమ్మకు చెందిన భూమిని మోసం చేసి, ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ సహకారంతో ఇతరుల పేరుతో రిజిస్ట్రేషన్ జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తులసమ్మకు సుమారు 1.25 ఎకరాల భూమి ఉంది. ఆమెకు తరువాత మరికొందరు వారసులు ఉన్నారు. అయితే ఆమె మనుమడు ఏనేటి ఉరఫ్ వేనేటి సురేష్ ఇన్‌చార్జి ఎస్సార్ ఉదయగిరి శ్రీనివాసులుతో కుమ్మక్కై, పింఛన్ కోసం సంతకాలు అవసరం అని చెప్పి తులసమ్మను మోసం చేసి సంతకాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అనంతరం డాక్యుమెంట్ నంబర్ 850/2025 కింద ఆ భూమిని సురేష్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా దీనిపై శనివారం తులసమ్మ కుటుంబ సభ్యులు కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి, ఈ వ్యవహారంపై ఆందోళన వ్యక్తం చేశారు. నా భూమికి సంబంధించిన పట్టాలు, డాక్యుమెంట్లు అన్నీ మా దగ్గరే ఉన్నాయి.. నాకు తెలియకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేశారు? మా పిల్లలందరికీ సమానంగా రావాల్సిన ఆస్తిని ఒక్కడి పేరుతో ఎందుకు చేశారు? అని తులసమ్మ ప్రశ్నించారు. భారీగా ముడుపులు తీసుకుని ఈ రిజిస్ట్రేషన్ జరిపారని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా అక్కడ పనిచేసిన ఉదయగిరి శ్రీనివాసులు (ప్రస్తుతం కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్) బాధితులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆయన గవర్నర్‌కి చెప్పుకో, ముఖ్యమంత్రికి చెప్పుకో, పవన్ కళ్యాణ్‌కి, లోకేష్‌కు చెప్పుకోం నన్నెవరూ ఏమీ చేయలేరంటూ వ్యవహరించారని బాధితులు ఆరోపించారు. ఈ ఘటనపై స్థానిక ప్రజలు, రాజకీయ నాయకులు తీవ్రంగా స్పందిస్తూ, రిజిస్ట్రేషన్ శాఖలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

'నా స్కానర్ నాకివ్వు'

ప్రస్తుతం కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగే ప్రతి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను స్కాన్ చేయడం తప్పనిసరి. అయితే సీనియర్ అసిస్టెంట్ ఉదయగిరి శ్రీనివాసులు ఆ స్కానర్ నాది, నా సొంత డబ్బులతో కొన్నది.. దానిని నేను తీసుకుపోతాను అంటూ శనివారం కార్యాలయం నుంచి స్కానర్‌ను తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో అనేక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. స్కానర్ లేకపోవడంతో సిబ్బంది, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

ఆటో ఢీకొని వాహన చోదకుడికి గాయాలు

వెంకటాచలం: ఆటో ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడు గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరులోని నిప్పో సెంటర్‌లో నివాసం ఉంటున్న సుబ్రహ్మణ్యం పని నిమిత్తం బైక్‌పై ముత్తుకూరు మండలంలోని పంటపాళేనికి వెళ్లారు. తిరిగి బయల్దేరగా, సర్వేపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. గాయపడిన సుబ్రహ్మణ్యాన్ని చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

నేత్రపర్వంగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పల్లకిసేవను నేత్రపర్వంగా జరిపారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

యాంత్రీకరణతో వ్యవసాయం లాభసాటి



పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్, ఇతర అధికారులు

నెల్లూరురూరల్: యాంత్రీకరణను పూర్తిస్థాయిలో అమలు చేస్తేనే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో రైతులు, వ్యవసాయాధికారులు, బ్యాంకర్లతో వ్యవసాయ యాంత్రీకరణ గురించి జరిగిన వర్క్‌షాప్‌లో కలెక్టర్ శనివారం పాల్గొని, మాట్లాడారు. వ్యవసాయాన్ని సుస్థిరమైన ఆదాయ వనరుగా మార్చేందుకు యాంత్రీకరణ అవశ్యకమన్నారు. దీని ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గి, ఉత్పాదకత పెరిగి వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. విత్తనాలు, ఎరువులు, సమయం, కూలీ ఖర్చులు అన్నింటిలో యాంత్రీకరణ ద్వారా మిగులు ఉంటుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రదర్శించిన 60 రకాల యంత్రాలలో రైతులకు ముఖ్యంగా అవసరమయ్యే వాటిని వ్యవసాయాధికారులు గుర్తించాలన్నారు. త్వరలో నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి యంత్ర పరికరాల అవసరాలను గుర్తించాలన్నారు. రైతులకు వ్యవసాయ యంత్రాలను అందించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. రైతులు, బ్యాంకర్ల మధ్య ప్రభుత్వం వారధిగా ఉంటుందన్నారు. అనంతరం వరి పంటలో యూరియా వినియోగం గురించి ప్రత్యేకంగా తయారు చేసిన పోస్టర్‌ను కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవతి, జిల్లా మత్స్య శాఖ అధికారి శాంతి, జిల్లా హార్టికల్చర్ అధికారి సుబ్బారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సత్యనారాయణ, ఆత్మ పీడీ మురళి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కులగణనతోనే బీసీలకు న్యాయం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అరిగెల నాగేంద్రసాయి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో బీసీలకు న్యాయం జరగాలంటే కులగణనతోనే సాధ్యం అవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి అన్నారు. సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులతో బీసీ కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనాభా ప్రాతిపదికన ఎక్కువగా ఉన్న బీసీలకు రానున్న స్థానిక ఎన్నికల్లో ఎక్కువ సీట్లు కేటాయించాలని, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రాజకీయ పార్టీలు ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీసీలను రాజకీయంగా వాడుకుంటున్నారే తప్ప వారికి దక్కాల్సిన సీట్లు, పదవుల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు ఒక్క ఎమ్మెల్యే సీటు లేదని, జిల్లాలోని 38 మండలాల్లో మండలస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు పోరాటాలు చేసేందుకు రాజకీయాలకు అతీతంగా బీసీలను ఒకే వేదికపై తీసుకొచ్చేందుకు కృషి చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించినట్లు వివరించారు. సమావేశంలో సీపీఐ నాయకులు రమణయ్య, మాలకొండయ్య, వినోదిని, పమజుల దశరథరామయ్య, రామరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు లీలామోహన్, ఏఐటీయూసీ నాయకుడు జిలానీఖాన్, ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు మస్తాన్, ఏపీ మహిళా సంఘం నాయకురాలు వనజ, సోఫియా, సాయిలత, శిరీష, సీపీఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, సీపీఐ ఎంఎల్ నాయకులు సాగర్, రామ్‌బాబు, బీసీ, వడ్డెర సంఘ నాయకులు నాగేశ్వరరావు, గుంజి దయాకర్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'నవ్వండి.. నవ్వించండి' నేడు



నెల్లూరు(బృందావనం): అల్లు రామలింగయ్య, తిక్కవరపు వెంకటరమణారెడ్డిలను స్మరిస్తూ 'నవ్వండి.. నవ్వించండి' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక నిర్వాహకుడు వై.శేషగిరీశం తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను శనివారం పురమందిరం ప్రాంగణంలోని వర్తమాన సమాజం హాల్లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నటులు అల్లు రామలింగయ్య, తిక్కవరపు రమణారెడ్డిలపై ప్రత్యేకంగా క్విజ్, హాస్య గీతాలు, జోక్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నామన్నారు. సమావేశంలో బుల్లితెర హాస్యనటుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు, ఎస్.సుబ్బరాయుడు, వి.కేశవులు, షేక్ అబ్దుల్ మజీద్, ఎస్వీ సత్యనారాయణ, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

చేనేత కార్మిక సంఘ అధ్యయన కమిటీ పర్యటన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త అధ్యయనంలో భాగంగా కమిటీ సభ్యులు శనివారం జిల్లాలో పర్యటించి చేనేత కార్మికుల స్థితిగతులను పరిశీలించారు. నగరంలోని నారాయణరెడ్డిపేటలో సంఘ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దశరథరామయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానికంగా గుమ్మలదిబ్బ, వడ్డిపాళెం ప్రాంతాల్లో పలువురిని కలిసి వారి ఆర్థిక పరిస్థితిపై ఆరాతీశారు. అనంతరం జిల్లాలోని ఆత్మకూరు, సంగం, హసనాపురం, కావలి ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో అధ్యయన కమిటీ సభ్యులు, నాయకులు నాగేశ్వరరావు, బాలాజీ, పమజుల హరి, లక్ష్మీకాంతం, శ్రీనివాసులు, అర్జున్, తిరుపాల్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వాహన తనిఖీలు



కొండాయపాళెం గేటు సమీపంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న ఆర్ఎస్సై చంద్రమౌళి

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి నగరంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనులపై కొరడా ఝుళిపించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతోన్న పలువురికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. రాంగ్‌రూట్, సెల్‌ఫోన్, ట్రిపుల్ రైడింగ్ తదితరాలపై భారీగా జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ జోనల్ చైర్మన్‌కు వినతి



నెల్లూరు సిటీ: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు 2024 నవంబర్ నుంచి రావల్సిన గ్రాడ్యుటీ చెల్లింపులు జరగలేదని ఏపీఎస్‌ఆర్టీసీ పీటీడీ (ఆర్వోడబ్ల్యూఏ) రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శేషగిరిరావు అన్నారు. ఈ మేరకు వీపీఆర్ విల్లాస్‌లో ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు పదవీ విరమణ చేసిన తర్వాత వారికి చట్ట ప్రకారం ఇవ్వాల్సిన గ్రాడ్యుటీ మొత్తాలను ప్రభుత్వం ఆలస్యం చేస్తోందన్నారు. తమ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో జగదీశ్‌బాబు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

కర్తవ్య నిర్వహణే భగవద్గీత సారాంశం



నెల్లూరు(బృందావనం): ఫలితంపై ఆసక్తి లేకుండా కర్తవ్యం నిర్వహించడమే భగవద్గీతలోని సారాంశమని ఉపన్యాసకుడు సూరం శ్రీనివాసులు తెలిపారు. పురమందిరం ప్రాంగణంలోని వర్తమాన సమాజం హాల్లో శనివారం రాత్రి అగస్త్యరెడ్డి వెంకురెడ్డి జయంతి సందర్భంగా 'శ్రీమద్భగవద్గీత'పై ఉపన్యసించారు. భగవద్గీతలోని సారాంశమంతా మూడో అధ్యాయంలో ఉందన్నారు. తొలుత శ్రీకృష్ణుడు, అగస్త్యరెడ్డి వెంకురెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. సమావేశంలో మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, గిరిజాలక్ష్మి, సీహెచ్ వెంకటేశ్వరరావు, గోవిందరాజు సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మారథాన్ నమోదుకు గడువు పొడిగింపు

నెల్లూరురూరల్: 'ఆంధ్రయువ సంకల్ప్ 2కే25 అంబాసిడర్' డిజిటల్ మారథాన్‌కు నమోదు గడువును అక్టోబర్ 15 వరకు పొడిగించినట్లు సెట్నల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎ.నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యువత భారీగా నమోదు చేసుకోవాలని కోరారు.

ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ పరీక్షలు

నెల్లూరు(అర్బన్): ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా విద్యాశాఖాధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 23వ తేదీ నుంచి జిల్లాలో పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు.

ఫార్మసీ ఆఫీసర్ రమేష్ మృతి



జోగి రమేష్(ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఫార్మసీ ఆఫీసర్‌గా సేవలందిస్తున్న జోగి రమేష్(52) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు సంతాపాన్ని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖలో పనిభారం పెరిగిపోయిందన్నారు. ఒత్తిడితో ఉద్యోగులు సతమతమవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఒక ఫార్మసీ ఆఫీసర్ ఉండే దగ్గర మరో పోస్టును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హంస యూనియన్ కార్యదర్శి కమల్‌కిరణ్, ఫార్మసీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ తదితరులు ఆయనకు సంతాపం తెలిపారు.

పోషకాహార ఆవశ్యకతపై అవగాహన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాన్ని శనివారం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నమ్మ పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిశేషమ్మ, స్వరాజ్యం, సుప్రజ, ఏఎన్ఎం శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు 58 కేంద్రాల ఏర్పాటు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో రెండో కారు వరి పంట పండిస్తున్న రైతులను ఆదుకునేందుకు 58 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అవసరాల మేరకు గత నాలుగు రోజుల్లో నాలుగు పీపీసీ(పాడి ప్రొక్యూర్‌మెంట్ సెంటర్స్)లను ఏర్పాటు చేశామన్నారు.

7న జిల్లాకు గుండ్రా సతీష్‌రెడ్డి రాక

నెల్లూరురూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి గౌరవ సలహాదారుగా వ్యవహరిస్తున్న భారత ప్రభుత్వ జాతీయ భద్రతా సలహా మండలి సభ్యుడు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి ఈనెల 7వ తేదీ జిల్లాకు రానున్నారు. 9వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నారు.

రూరల్ పరిధిలో 3,479 మందికి లబ్ధి

నెల్లూరు సిటీ: ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద రూరల్ నియోజకవర్గ పరిధిలో 3,479 మందికి లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన రూరల్ పరిధిలో శనివారం నమూనా చెక్కును ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ పథకం కింద రూరల్ పరిధిలో ఆటో డ్రైవర్లకు రూ.5.22 కోట్ల లబ్ధి చేకూరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత



నియామక పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్

నెల్లూరురూరల్: కారుణ్య నియామకాల ద్వారా నలుగురికి కలెక్టర్ హిమాన్షు శుక్లా ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ మేరకు శనివారం ఆయన తన చాంబర్‌లో నియామక పత్రాలను అందించారు. టి.శ్రీపూజను రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా, డి.చక్రవర్తిని ట్రెజరీలో జూనియర్ అసిస్టెంట్‌గా, ఎ.నాగశివతేజను పంచాయతీరాజ్ శాఖలో గ్రేడ్–2 ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా, కె.జ్యోతిని బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో కామాటిగా నియమిస్తూ కలెక్టర్ కారుణ్య నియామక ఉత్తర్వులను అందించారు. ఉద్యోగాలు పొందిన వారు విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని కోరారు.

పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దండి



పార్కులో మౌలిక వసతులను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): పార్కుల్లో మౌలిక వసతులు కల్పించి ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నగరపాలక కమిషనర్ వైఓ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా శనివారం స్థానిక 16వ డివిజన్ జగదీష్ నగర్ పార్కు, 14వ డివిజన్ వేపదొరువు పార్కు, 11వ డివిజన్ మూడు జెండాల సెంటర్ పార్కు, ఈసీఎస్సార్ పార్కు, 8వ డివిజన్ రేబాలవారి వీధి పార్కు, బాలభవన్ పార్కు, తొమ్మిదో డివిజన్ బంగ్లాతోట పార్కులను కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్కుల్లో పచ్చదనం, క్రీడా పరికరాలు, ఆట వస్తువులు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించి, అవసరమైన నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. పార్కుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ అనిల్‌కుమార్, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావు, శానిటేషన్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాలో నెల్లూరు మహిళకు అవార్డు



అవార్డు అందుకుంటున్న అరుణకుమారి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరుకు చెందిన యోగా క్రీడాకారిణి పాటూరు అరుణకుమారి అంతర్జాతీయ యోగా అవార్డును సాధించింది. శ్రీలంక దేశంలోని కొలంబోలో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ యోగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమెచ్యూర్ ఓల్డ్ యోగా కప్–2025లో కామన్ గ్రూప్‌లో ప్రథమ స్థానంతో గోల్డ్ మెడల్‌ను సాధించి శనివారం కప్‌ను సొంతం చేసుకున్నారు. మలేషియా, సింగపూర్, హాంకాంగ్, ఫ్రాన్స్, ఇండియా, శ్రీలంక దేశాల నుంచి 456 మంది క్రీడాకారులు పాల్గొన్న పోటీల్లో సింబల్ యోగా, రిథమిక్ యోగాల్లో మొదటి స్థానం సాధించి అవార్డును పొందింది.

హామీలను విస్మరించిన కూటమి నేతలు



మాట్లాడుతున్న గుంజి దయాకర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎన్నికల సమయంలో వడ్డెరలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని, వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజి దయాకర్ డిమాండ్ చేశారు. నగరంలోని పూలే విగ్రహం వద్ద ఉన్న భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాటయోధుడు వడ్డే ఓబన్న వర్ధంతిని ఈనెల 6వ తేదీన వాడవాడలా నిర్వహించాలని, నగరంలో నిర్వహించే కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వడ్డెర కులస్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నేటి కూటమి ప్రభుత్వంలో వడ్డెరలపై దాడులు, అక్రమ కేసులు బనాయించడం ఎక్కువయ్యాయన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు మట్టిపనులు, కంకర, గ్రావెల్, ఇసుక, క్వారీల్లో వడ్డెరలకు రిజర్వేషన్ కల్పించి సీనరీ చార్జీలు మినహాయించాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన వడ్డెరలకు పింఛన్ సౌకర్యం, నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు వెంకటేష్, వెంకటేశ్వర్లు, వెంకయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ గత నెల 15 నుంచి ఈనెల 4వ తేదీ వరకు 20 రోజులకు భక్తులు అమ్మవారికి హుండీ ద్వారా రూ.30,45,197లు, అన్నదాన హుండీ ద్వారా రూ.69,124 సమర్పించారన్నారు. అలాగే మిక్స్‌డ్ బంగారు వస్తువులు 0.073 గ్రాములు, వెండి ఆభరణాలు 0.298 గ్రాములు, విదేశీ కరెన్సీ కింద యూఎస్‌ఏ డాలర్లు వచ్చాయన్నారు. మూడిపర్తి రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఈఓ ఎస్.శ్రీధర్‌నాయుడు, దేవదాయ, ధర్మదాయశాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌బాబు పర్యవేక్షించారన్నారు.

నవంబర్ 5న మహాకార్తీక దీపోత్సవం



సమావేశంలో పాల్గొన్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నవంబర్ 5వ తేదీ మహాకార్తీక దీపోత్సవం, 7న స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం జరుగనుందని సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్ష, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.వెన్నెల, కె.జయప్రద తెలిపారు. స్థానిక రామ్మూర్తి నగర్‌లోని ఎస్ఆర్ కల్యాణ మండపంలో కార్తీక దీపోత్సవ సమితి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని గణేష్‌ఘాట్ స్వర్ణ లింగేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం, ఆకాశ దీపోత్సవం, గంగాహారతి, మహా కార్తీక దీపోత్సవం, ఆధ్యాత్మిక ప్రవచనం తదితర కార్యక్రమాలు జరుగనున్నాయన్నారు. సమావేశంలో నిర్వాహకులు శ్రీకంఠం రమణయ్య, కోడూరు జయరామయ్య, ముక్కాల వ్యాస్‌ప్రసాద్, ఏవీఆర్ మోహన్‌రావు, రఘునాథరాజు, సి.జనార్దన్‌రాజు, కాకు మురళీరెడ్డి, హర్షవర్ధన్, ప్రవీణ, గద్దం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలపై దుష్ప్రచారం తగదు



మాట్లాడుతున్న షణ్ముఖరావు

నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో జరిగిన శరన్నవరాత్రి మహోత్సవాలు, ఆలయ నిర్వహణపై కొందరు వ్యక్తులు సోషల్ మీడియా ద్వారా చేస్తున్న అసత్య ప్రచారాలు సరికాదని దేవస్థానం ధర్మకర్తల మండలి కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి తమ ధర్మకర్తల మండలిపై కొందరు సోషల్ మీడియా వేదికగా పనిగట్టుకొని చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆలయ నిర్వహణకు సంబంధించి ఎలాంటి అవకతవకలు జరగలేదన్నారు. తాము గత పాలక మండలితో లోపాయకారి ఒప్పందం చేసుకుని రూ.2 కోట్లు తీసుకొని వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నామంటూ చేస్తున్న ప్రచారం సరికాదన్నారు. సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి నిచ్చెనమెట్ల చిరంజీవి, కోశాధికారి జనార్దన్‌రావు, అంజనేయులు, వాయుగుండ్ల బ్రహ్మయ్య, రమేష్, సురేష్, వెంకటేశ్వర్లు, దగ్గుమాటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.